# త్యాగనిరతికి నిలువుటద్దం 'ప్రజా నాయకుడు ప్రకాశం'

(కల్చరల్ కంట్రిబ్యూటర్)

విజయవాడ, ఆగస్టు 12 (స్పాట్ న్యూస్)- తెలుగువారి గుండెల్లో పదిలంగా పదికాలాలపాటు నిలచిపోయే తెలుగింటి పెద్ద టంగుటూరి ప్రకాశం పంతులు. ఆయనపై తెలుగువారికున్న అభిమానం 'మరణింపదు కోటి యుగాలకైన' అనే స్ఫూర్తితో శనివారం కళాక్షేత్రంలో 'ప్రజా నాయకుడు ప్రకాశం' అనే నాటకం రసరంజని (హైదరాబాద్) ప్రదర్శించగా ప్రేక్షకులకు ఉద్వేగ్నం, ఉత్తేజం, కలగలిపి ఉద్రూత లూగించింది. ప్రకాశం పంతులు ఆత్మకథ 'నా జీవిత యాత్ర' ఆధారంగా రాసిన ఈ నాటకంలో ఒంగోలులో ప్రకాశం బాల్యదశ, ఇమ్మానేని హనుమంతరావు నాయుడు ప్రాపకం, వకీలుకావటం, బారిష్టర్ కావటం, తల్లి మరణం, రాజకీయ ప్రవేశం, సైమన్‌రాక, తుపాకికి రొమ్ము చూపటం, ఉప్పు సత్యాగ్రహం, మద్రాసు రాష్ట్ర ప్రధాని, రాజకీయాల్లో ఆటుపోట్లు, ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి, స్వర్గయాత్ర అంశాలను రేఖామాత్రంగా స్పృశించి అద్భుతంగా నాటకీకరణ గావించారు. నాటకం తొలిదశలో ప్రకాశం తల్లి పాత్రలో సుప్రసిద్ధ నటులు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి తన అసమాన సాత్వికాభినయంతోసంభాషణా శైలితో నాటకానికే జీవగర్రగా నిలచి ప్రాణంపోశారు. నాటకం రెండవ భాగంలో ప్రజానాయకుడు ప్రకాశంగా సుప్రసిద్ధ నటులు, ప్రయోక్త చాట్ల శ్రీరాములు తన అద్వితీయమైన నటన, వాచకం, వీర రసాభినయంతో నాటకానికి పట్టుగొమ్మగా నిలచి సజీవం చేశారు. ప్రకాశం వ్యక్తిత్వంలోకి పరకాయప్రవేశంచేసి, నేటి రాజకీయాన్ని దృష్టిలో పెట్టుకుని రచయిత పలికించిన సంభాషణలు హర్షధ్వానాలందుకున్నాయి. 'రాజకీయ నాయకుడు పదవిపై చూపే తాపత్రయంలో నూరవవంతు బాధ్యతపై చూపితే దేశం బాగుపడుతుంది' 'మనిషి వేరు, సిద్ధాంతం వేరు, సిద్ధాంతాన్ని ఖండించినా మనిషిని ద్వేషించకూడదు, నా ప్రక్కన ప్రజలు వున్నారు, నేను ప్రజల మనిషిని' అని ప్రకాశం చెప్పటం, చెన్నపట్నం (చెన్నయ్) ఆంధ్ర రాష్ట్రంలో కలపటం కోసం ఆయన పడిన తపన, తదితర విషయాలను ప్రదర్శించి నిస్వార్థపూరితమైన త్యాగభరితమైన నిరాడంబరమైన ప్రకాశం పంతులు వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించటంలో రచయిత మెదలి నాగభూషణశర్మ కృతకృత్యులయ్యారని చెప్పవచ్చు. సైమన్ గోబ్యాక్ అంటూ 'ఓరయ్యో జానుసైమనూ గోబాకూ లండనూ' అని పాటతో ఉద్యమించటం ఆ సందర్భంగా ఎత్తిపట్టిన తుపాకికి తన రొమ్ము చూపించి 'ఆంధ్రకేసరి' గా జేజేలందుకోవటం ఉద్విగ్న భరితులను చేసింది. బాలప్రకాశం పరీక్ష ఫీజు కట్టటానికి తల్లి తన పట్టుచీర అమ్మివేసి మూడు రూపాయిలు కొడుకుచేతిలోపెట్టే సన్నివేశం కదిలించింది. ఇంకా ఉప్పు సత్యాగ్రహం, పఠాభి, రాజాజీలతో ప్రకాశం భేటీ తదితర సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. ఈ నాటకానికి రచన దర్శకత్వం మెదలి నాగభూషణశర్మ, ఇందులో బి. నారాయణ, ఫ్రాన్సిస్, ప్రతిమ, హేమమానస, సోమేశ్వరరావు, కళ్యాణి, నారాయణస్వామి, కె.వి. శాస్త్రి, క్రమధాటి వెంకటేశ్వరశర్మ, జగ్గారావు, గంగాధరరావు, బాలకృష్ణ, కుటుంబశర్మ, మల్లికార్జున్, జనార్ధన్, మోహన్, కృష్ణంరాజు, వేణుగోపాల్, రమేశ్, మూర్తి, కృష్ణ, రవంతుల, సాకేతరామ, మారయ్య, అనిల్, శ్రీరామమూర్తి, ఆనంద మోహన్, పుండరీకాక్షశర్మ, ఆంజనేయులు, రఘునందన, గరిమెళ్ళ, ముట్నూరి, శ్యామల, రామకృష్ణశాస్త్రి, కీర్తన్, రెడ్డి, మహేశ్, మహేంద్ర లబ్బాని, రమేష్‌కుమార్, పలు పాత్రల్లో సమర్థంగా నటించారు. స్వాతంత్ర్య సమరయోధులు, ప్రకాశంగారి అనుచరుడు శిరిపురపు కోటేశ్వరరావు కళాకారులను అభినందించారు. ఇంత అద్భుతమైన నాటకానికి సరైన ప్రచారం లేకపోవటం వలన ప్రేక్షకుల సంఖ్య స్వల్పంగా వుండటం, నగరానికి చెందిన కళాకారులు కూడా తక్కువగా రావటం నిరాశ కలిగించింది. ఈ నాటక బృందానికి పలువురు ప్రేక్షకులు అభినందనలు అందజేశారు.



శనివారం విజయవాడలో టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత నాటకం 'ప్రజానాయకుడు'లో కొన్ని రసవత్తర సన్నివేశాల దృశ్యం.



'ప్రజానాయకుడు' నాటకంలోని ఒక దృశ్యం.